


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 99	ఎడిటర్ : డి.శివకృష్ణ	ఆదివారం	25-10-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 99	EDITOR : D.SHIVAKRISHNA	SUNDAY	25-10-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

జర్నలిస్టులకు తీపికబురు..

ఇళ్ల స్థలాల పంపిణీపై బిగ్ అప్‌డేట్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రాష్ట్రంలో ఏళ్లకు ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు లేకుండా, నివాస యోగ్యమైన ప్రాంతంలో స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం సచివాలయంలో జరిగిన అధికారుల సమీక్షలో ఆయన వెల్లడించారు.

న్యాయపరంగా చిక్కులు లేని పరిష్కారం..

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2008లో ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయించినప్పటికీ, సుప్రీంకోర్టులో (మిగతా 2లో..)

విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు

తమిళనాడు ప్రభుత్వంపై కేంద్రం ప్రశంసలు



జాతీయం:

విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్‌ను గణనీయంగా తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కేంద్రం ప్రశంసలు కురిపించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగి విమాన యాన రంగానికి నిర్వహణ వ్యయం భారంగా మారిన తరుణంలో తమిళనాడు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్ర సివిల్ ఏవియేషన్ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా అభినందించారు. విమాన ప్రయాణాలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలంటే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రయాణికుల ప్రయోజనాలే ఉమ్మడి ప్రాధాన్యత కావాలని సూచించారు. ఈ చొరవ తీసుకున్న తమిళనాడు సీఎం విజయ్‌కు ధన్యవాదాలని పేర్కొన్నారు. కాగా.. నూతన నిబంధనల ప్రకారం, చెన్నై విమానాశ్రయంలో ఏటీఎఫ్ పై ఉన్న వ్యాట్‌ను 29 శాతం నుంచి 16 శాతానికి తగ్గించగా, రాష్ట్రంలోని మిగిలిన అన్ని ప్రాంతీయ విమానాశ్రయాలలో ఈ పన్నును ఏకంగా 29 శాతం నుంచి 1 శాతానికి కుదించారు. అంతే కాకుండా, 40,000 కిలోల కంటే తక్కువ బరువున్న చిన్న విమానాల ఇంధనంపై వ్యాట్‌ను 5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించారు. ఈ రాయితీలు ఈ ఏడాది నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది అక్టోబర్ 31 వరకు అమలులో ఉంటాయి.

తెలంగాణపై 'అర్నాబ్' తుఫాను ఎఫెక్ట్..

ఆ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. అక్టోబర్ 26 నాటికి ఇది 'అర్నాబ్' తుఫానుగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ వాయుగుండం ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై తీవ్రంగా ఉండనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల అలర్ట్ కొనసాగనుంది.

ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ..

రాష్ట్రంలో భారీ వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున జయశంకర్ భూపాలపల్లి, హన్మకొండ, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఈ జిల్లాల్లో కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ఈ వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నాయి. ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు.

ఆ పరీక్షను వెంటనే వాయిదా వేయండి..

సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు లేఖ

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో.. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయవద్దని కోరారు. నవంబర్ 6న జరగనున్న TGPSC AEE పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. SSC JE, TGPSC AEE పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో SSC JE పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగివచ్చి AEE పరీక్ష రాయడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో ఒకదాన్ని వదులుకోవాల్సిన దుస్థితిలో నిరుద్యోగ యువత ఉందని తెలిపారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం స్పందించడంలేదని అన్నారు. పరీక్షల తేదీలను పునఃపరిశీలించాలని అక్టోబర్ 14నే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి TGPSCకి లేఖ రాశారని తెలిపారు. నిరుద్యోగ యువత కోరుతున్నది ఉద్యోగాలు ఇవ్వకుండా పరీక్షలు వాయిదా



వేయాలని కాదని, రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని మాత్రమేనని చెప్పారు. ఒడిశా, బీహార్ లాంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు? అని ప్రశ్నించారు. (మిగతా 2లో..)

సూపర్ ఎల్‌నినో ముప్పు..

నీటిని పొదుపుగా వాడండి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



స్టార్ త్రినేత్రం, ఖమ్మం:

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని చింతకాని మండలం కొదుమూరులో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శనివారం డిప్యూటీ సీఎం మాట్లాడారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని తెలిపారు. వర్షాలు తగ్గి, నీటి వనరులు ఎండిపోతే తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని కాపాడుకోవాలని.. వాటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాలని కోరారు. పశువులు, ఇతర జీవరాశులకు నీటి కొరత రాకుండా చూడాలని, ఆహార పదార్థాల కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కరోనా సమయంలో సమష్టిగా స్పందించినట్టే.. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి కూడా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

'ఇరిగేషన్ రంగాన్ని కేసీఆర్ అండ్ కంపెనీ సర్వనాశనం చేశారు': మంత్రి ఉత్తమ్ ఫైర్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ ఇరిగేషన్ రంగాన్ని కేసీఆర్ అండ్ కంపెనీ సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నాణ్యతాలోపాల వల్లనే కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోయాయని చెప్పారు. తామే కట్టాము.. తామే కూల్చాము అని చెప్పడానికే బీఆర్ఎస్ నాయకులు కన్నెపల్లి పర్యటన చేపట్టారని అన్నారు. కమిషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ రైతాంగం ఇబ్బందులకు కారణమైన వారే ఇప్పుడు ఉల్టా చోర్ కొత్వాల్ కో అన్నట్లు మరొకరిపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. (మిగతా 2లో..)

పీఎం రాహత్ పథకం..

ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వైద్యం: సీఎస్ సంజయ్ జాజు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా శాఖ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా చర్యలు (మిగతా 2లో..)



గచ్చిబౌలిలో 3.5 ఎకరాల్లో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు: మంత్రి శ్రీధర్ బాబు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

గచ్చిబౌలిలో 3.5 ఎకరాల్లో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. శనివారం టీజీఎల్ఐపీసీ సమీక్షలో లెదర్ పరిశ్రమ అభివృద్ధికి చర్యలపై మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు పూర్తిగా మార్గనిర్దేశం చేశారు. లెదర్ ఉత్పత్తులకు వాల్యూ యాడెడ్ చేసి మార్కెటింగ్‌కు సహకారం కల్పిస్తున్నామని వెల్లడించారు. (మిగతా 2లో..)



స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/2026/A0436
అనుక్షణం నిక్షేపణం తెలుగు దినపత్రిక

పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:



త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన శాసనమండలి ఉపపక్ష నేత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని శనివారం వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.

ఓటరు నమోదు ప్రక్రియపై చర్చ

ఈ సందర్భంగా రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. పట్టభద్రుల ఓటరు జాబితాలో అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఈ భేటీలో ప్రాధాన్యం ఇచ్చారు.

కొత్తపల్లిలో కలెక్టర్ సత్యశారద క్షేత్రస్థాయి పర్యటన

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఎల్‌నినో ప్రభావంపై కార్మికులకు అవగాహన

స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం జిల్లా కలెక్టర్ సత్యశారద క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కార్మికులకు పలు సూచనలు చేశారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో కలిగే నష్టాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, పీడీ, ఎంపీడీఓ వెంకటరమణ, స్థానిక సర్పంచ్ కొడగాని సునీత రాజేష్ ఖన్నా, ఇతర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



స్టార్ త్రినేత్రం, వరంగల్:

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కేఎల్ఎన్ కన్వెన్షన్‌లో గ్రేటర్ వరంగల్ 1వ, 2వ, 65వ, 66వ డివిజన్లతో పాటు హసన్‌పర్తి గ్రామీణ మండలం, ఐనవోలు మండల పరిధిలోని నాయకులు, 100 ఓట్ల బాధ్యులతో సమావేశమై నమోదు ప్రక్రియపై చర్చించారు.

నవంబర్ 6లోగా అర్హులందరూ నమోదు చేసుకోవాలి..



ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, కొత్త ఓటర్ల నమోదు సంఖ్య పెరిగేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మసూద్‌తో పాటు ఆయా డివిజన్లు, మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం రాహత్ పథకం..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షల వరకు వైద్య చికిత్స అందించే అవకాశం ఉందని తెలిపారు.రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వెయ్యికి పైగా ఆసుపత్రులు నమోదై ఉండగా.. పీఎం రాహత్‌లో ఇప్పటివరకు 469 ఆసుపత్రులే నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన నెట్‌వర్క్ ఆసుపత్రులను కూడా ఈ పథకంలో నమోదు చేయించాలని సీఎస్ ఆదేశించారు. పీఎం రాహత్ ద్వారా ఏటా కనీసం రూ.100 కోట్ల మేర వైద్య సహాయం అందించే అవకాశం ఉందని, దీని అమలుతో ఆరోగ్యశ్రీపై ఆర్థిక భారం తగ్గే వీలుందని పేర్కొన్నారు. చికిత్స అందించే సమయంలో పోలీసు దర్యాప్తుతో పాటు పథకానికి సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

'ఇరిగేషన్ రంగాన్ని కేసీఆర్ అండ్ కంపెనీ సర్వనాశనం చేశారు': మంత్రి ఉత్తమ్ ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

కేవలం కక్షపూరితంగా, కమిషన్ల కక్కుర్తితోనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌ను మార్చి మేడిగడ్డలో చేపట్టారని ఆరోపించారు.రూ.38 వేల కోట్లతో 16.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఆ ప్రాజెక్ట్‌ను రూ.1.5 లక్షల కోట్లకు పెంచేశారని విమర్శించారు. ఎల్‌నినో వల్ల అక్టోబర్ నెలలో ఒక్క చుక్క వర్షం పడలేదని చెప్పారు. తెలంగాణలో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ పరిస్థితి అలానే ఉందన్నారు. ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితుల్లో ప్రజలు బాధపడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. గత పదేళ్లలో తీసుకువచ్చిన అప్పులు సరిగ్గా ఖర్చు చేసి ఉంటే ఎల్‌నినో ప్రభావం రైతులపై తక్కువగా ఉండేదని చెప్పారు.

వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్

స్టార్ త్రినేత్రం, కరీంనగర్:



భారతీయ విద్యా వ్యవస్థ అకాడమిక్స్ పరంగా ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నప్పటికీ, నైపుణ్య (స్కిల్) ఆధారిత విద్యలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా ఆయన ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను మీడియాకు వెల్లడించారు. అక్టోబర్ 17 నుంచి 22 వరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో పర్యటించి, పలు యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది ఎడ్యుకేషన్ లీడర్లతో కలిసి అక్కడి విద్యా విధానం, కరిక్యులం, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు.

ఒకేషనల్, టెక్నికల్ విద్యపై దృష్టి అవసరం..

మన దేశంలో విద్య కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లను తయారు చేసే దిశగానే సాగుతోందని నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనివల్ల అందరూ ఆ స్థాయికి చేరలేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, టెక్నికల్, ఒకేషనల్, స్కిల్ బేస్డ్ కోర్సుల్లో వెనుకబడిపోతున్నామని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక పనులకు సైతం ఇతరులపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్ట్రేలియాలో మాత్రం బైపీసీ, ఎంపీసీలతో పాటు సీఈసీ, ఎంఈసీ, వెటర్నరీ, ఆర్ట్స్, మ్యూజిక్, స్పోర్ట్స్ తదితర అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, అక్కడ విద్యార్థుల్లో ఎలాంటి ఒత్తిడి కనిపించదని పేర్కొన్నారు.

పాఠశాల స్థాయిలో ఒకే విద్యా విధానం..

అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని, మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు 50 శాతం మార్కులు కేటాయిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూనియర్ కళాశాలలను పాఠశాల స్థాయిలో విలీనం చేసే అంశంపై స్పష్టతనిచ్చిన నేపథ్యంలో, ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే 8వ తరగతి నుంచే విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టులు (బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, అగ్రికల్చర్ సైన్స్, స్పోర్ట్స్) ఎంచుకునే స్వేచ్ఛ ఉందని వివరించారు. మైనర్ పిల్లల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని అక్కడ చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని చెప్పారు.

అల్ఫోర్స్‌లో ఇంటర్నేషనల్ కరిక్యులం..

తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో త్వరలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆమోద ప్రక్రియ తుది దశకు చేరిందని, రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ఈ కరిక్యులంతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

తల్లిదండ్రులకు విజ్ఞప్తి..

మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవద్దని, ఐఐటీ, మెడిసిన్‌తో పాటు క్లాట్, సీఏ, అగ్రికల్చర్, స్పోర్ట్స్ తదితర రంగాల వైపు కూడా పిల్లలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ బోర్డులు, లేబొరేటరీలను మరింత ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌పై కన్నేసిన పీవీ సింధు..

థ్రిల్లింగ్ పోరులో గెలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లిన సింధు



క్రీడలు:

భారత స్టార్ షెట్లర్ పీవీ సింధు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన ప్రదర్శనను కొనసాగిస్తూ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ పోరులో సింధు అద్భుత ఆటతీరుతో విజయం సాధించి టైటిల్ నమరానికి అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చైనీస్ తైపీకి చెందిన చియు పిన్-చియాన్‌ను కేవలం 39 నిమిషాల్లోనే 21-13, 21-14 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి సింధు సెమీఫైనల్‌లో అడుగుపెట్టారు. ఇక సెమీస్‌లో జపాన్‌కు చెందిన హీనా అకెచితో తలపడిన సింధు, మూడు గేమ్‌ల ఉత్కంఠ పోరులో 21-10, 20-22, 21-16 తేడాతో విజయం సాధించి ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

ఒకే ఒక్క భారత ఆశ..

టోర్నీలో లక్ష్యసేన్ వైదొలగడం, సాత్విక్-చిరాగ్ జంట తొలి రౌండ్లోనే వెనుదిరగడం, అశ్మిత చాలిహా క్వార్టర్స్‌లో నిష్క్రమించడంతో ఈ టోర్నీలో భారత్ తరఫున పీవీ సింధు ఒక్కరే టైటిల్ రేసులో నిలిచారు. ఈ టోర్నీలో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవాలనే పట్టుదలతో ఉన్న సింధు, ఇవాళ జరగనున్న తుది పోరులో కొరియాకు చెందిన టాప్ సీడ్ అన్ సే-యంగ్‌తో తలపడనున్నారు.

గచ్చిబౌలిలో 3.5 ఎకరాల్లో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు: మంత్రి శ్రీధర్ బాబు

(మొదటిపేజీ తరువాయి)

యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

రుక్మాపూర్‌లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,000 మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జమ్మికుంట, ఆర్మూర్‌లో ప్లగ్ అండ్ ప్లే ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో లిడ్ క్యాప్‌కు కేటాయించిన భూములపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

ఆ పరీక్షను వెంటనే వాయిదా వేయండి..

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి బేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని కోరారు. తక్షణమే సీఎం జోక్యం చేసుకొని నవంబర్ 6న జరగనున్న ఎ+ూజ ూజుజు (సివిల్) వరీక్షను వాయిదా వేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఎ+ూజ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జర్నలిస్టులకు తీపికబురు..

(మొదటిపేజీ తరువాయి)

కేసు పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రక్రియ నిలిచిపోయిందని మంత్రి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే, 2024 సెప్టెంబర్ 8న రవీంద్రభారతిలో కార్యక్రమం నిర్వహించి సొసైటీకి భూమిని అప్పగించామని తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల వల్ల మళ్లీ సమస్యలు రావడంతో సీఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రులతో చర్చించి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించినట్లుగా వెల్లడించారు.

జర్నలిస్టులకు భరోసా..

గతంలో వచ్చిన న్యాయపరమైన అడ్డంకులు పునరావృతం కాకుండా, గౌరవప్రదమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని, జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పొంగులేటి భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, జర్నలిస్టుల సొంతింటి కలను త్వరలోనే సాకారం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో బిల్లు డబ్బుల కోసం తుపాకీతో యువకుడి బెదిరింపులు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో రివాల్వర్‌తో ఓ యువకుడు కలకలం సృష్టించాడు. బిల్లు డబ్బుల కోసం కస్టమర్లు, బౌన్సర్లపై తుపాకీతో బెదిరింపులకు దిగాడు. బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేసే సిబ్బందితో సదరు యువకుడు శుక్రవారం అర్ధరాత్రి వాగ్వాదానికి దిగాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. థార్ కారులో నుంచి రివాల్వర్‌ను యువకుడు తీశాడు. తాను చెల్లించిన బిల్లు డబ్బులు వెనక్కు ఇవ్వకపోతే కాల్చేస్తా అంటూ నిందితుడు బెదిరింపులకు దిగాడు. దీంతో భయంతో సిబ్బంది, కస్టమర్లు పరుగులు తీశారు. నిందితుడు మహ్మద్ షానవాజ్ (24)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రివాల్వర్, థార్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సాయిరూప ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలో నిత్యావసర సరుకుల కిట్ పంపిణీ కార్యక్రమం

పేదలకు, నిరుపేదలకు అండగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్





స్టార్ త్రినేత్రం,వేములవాడ :

వేములవాడ ప్రభుత్వ దవాఖానలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రోజు సేవాకార్యక్రమం నిర్వహించారు.నిత్యావసర సరుకులు కిట్ పేదవారికి వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు పిల్లి బాబురావు మాట్లాడుతూ దాతల సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. కరీంనగర్ చెందిన పి. హస్మిక పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమానికి ఎద్దండి రాజు సరళ ఆర్థిక సహాయం అందించారు. దాతలందరికీ ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పేదల కూ అండగా అనేక సేవ కార్యక్రమంలు నిర్వహిస్తున్న సాయి రూప ట్రస్ట్ ని పలువురు అభినందిస్తిన్నారు. అనేక సేవ కార్యక్రమం లు నిర్వహిస్తూ అందరి ప్రశంశలు అందుకుంటున్నది.ఇంత మంచి సేవలు చేస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ నూ ఏవో నాగరాజు అభినందించారు గత కొద్దీ కాలముగా వీరు చేస్తున్న సేవలు గొప్పగా ఉన్నాయి అని సమాజానికి ఇటువంటి ట్రస్ట్ లు ఎంతో ఉపయోగం అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ధవాఖాన ఏవో నాగరాజు, ఎద్దండి రాజు, వాసాల హరిప్రసాద్,గోశేటి నవీన్, వేముల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ సమావేశంలో పాల్గొన్న మంత్రులు

వరంగల్ నుంచి నిమ్మాని శేఖర్ రావు హాజరు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:



హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శనివారం లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు పాల్గొన్నారు. లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, లీగల్ సెల్ బలోపేతం, పార్టీ కార్యక్రమాల్లో న్యాయవాదుల పాత్ర తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని సమావేశంలో ప్రస్తావించారు. పార్టీకి సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాల్లో లీగల్ సెల్ మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. ఈ సమావేశంలో లీగల్ సెల్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతిని కలిసిన పీవీఆర్



స్టార్ త్రినేత్రం, మేడ్చల్:

మేడ్చల్ రూరల్ జిల్లా నాగారం డివిజన్ బీజేపీ జనరల్ సెక్రటరీ పోతంశెట్టి వెంకటేశ్వర రావు శనివారం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సుమతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునికి ఘన సన్మానం చేసిన డాక్టర్ కొండ దేవయ్య పటేల్

స్టార్ త్రినేత్రం,వేములవాడ :



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునిగా నియమింపబడిన నిరంతరం సమాజహితం, సంఘ శ్రేయస్సు ధ్యేయంగా సేవలందిస్తున్న వేములవాడ మున్నూరు కాపు సత్రం ఉపాధ్యక్షులు ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డి కి మున్నూరు కాపు సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ శాలువాతో ఘన సన్మానం చేసి శ్రీ రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేయడం జరిగింది. సందర్భంగా కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ అన్నా రెడ్డి వంటి ఆదర్శం గల వ్యక్తులు అరుదని సమాజానికి ఏదో చేయాలని తపన కలిగిన వ్యక్తి అన్నా రెడ్డి అని అలాంటి వ్యక్తి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కావడం చాలా గొప్ప విషయమని శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు సత్రానికి 90 లక్షల రూపాయలు దాతల నుండి సేకరించి ఇచ్చారని వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా అన్నా రెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని సమాజంలో అందరూ బాగుండాలని ప్రజలంతా ఆధ్యాత్మికత వైపు ఉండాలి అని మీ అందరి సహాయ సహకారాలు ఉన్నాయని అందుకే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక అయ్యానని తను సమాజ హితం కోసం ముందుకు సాగుతానని వారు అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మున్నూరు కాపు సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, సత్రం ఆర్గనైజింగ్ కార్యదర్శిచిలుక రమేష్, సాయి ని నరేందర్, కర్నే రాజమౌళి,చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట ఎస్సై బి.ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు



స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:

వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి.ప్రవీణ్‌ను తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా సేవలందించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి తాటికాయల వివేకానంద, చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ బెల్లం కుమార్ స్వామి పాల్గొన్నారు. నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపి, ఆయనకు తమ అభినందనలు తెలియజేశారు.

మంత్రులను కలిసిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చ









స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:

హైదరాబాద్‌లో వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, స్థానికంగా నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి శనివారం మంత్రులను కలిశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు.

అభివృద్ధిపై మంత్రుల సానుకూల స్పందన

వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, స్వయంగా మంత్రుల వద్దకు తీసుకెళ్లి సమస్యలను వివరించేలా సహకరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నేతవత్ శిబా రాణి రాజేందర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భాను, కాంగ్రెస్ నాయకులు శ్రీపాద సతీష్, నాంపెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అమరవీరురాలిగా గుర్తింపు పొందిన గాజుల సౌమ్యకు ఘన నివాళి





స్టార్ త్రినేత్రం, హనుమకొండ:

విధి నిర్వహణలో వీరమరణం పొందిన కుమారి గాజుల సౌమ్యకు జాతీయ అమరవీరురాలిగా గుర్తింపు లభించిన సందర్భంగా 2026 అక్టోబర్ 24న హనుమకొండ సుబేదారిలోని ఎక్సైజ్ క్లబ్‌లో శనివారం ఘనంగా శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ దత్తరాజు గౌడ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, ఏఈఎస్ బ్రహ్మానంద రెడ్డి, అర్బన్ ఎస్‌హెచ్‌ఓ స్వప్న, హనుమకొండ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని సౌమ్యకు నివాళులర్పించారు.

గంజాయి నియంత్రణలో సౌమ్య సాహసం ఆదర్శం

ఈ సందర్భంగా దత్తరాజు గౌడ్ మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణలో గాజుల సౌమ్య ప్రదర్శించిన ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ఆమెకు జాతీయ అమర వీరురాలిగా గుర్తింపు రావడం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌నీ, ఈనీ కానిస్టేబుళ్ల సంఘం చైర్మన్ వి.కొమురయ్య, హనుమకొండ అధ్యక్షుడు కె.లింగేశ్వర్, గ్రామీణ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి టి.సత్యనారాయణ, హెచ్.హెచ్. ప్రభాకర్, కోశాధికారులు కె.సుధాకర్, బొజ్జల నరేష్, డి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి: ఎస్సై రాజు

ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడే గొప్ప సేవే రక్తదానం: జక్కుల అనిల్ యాదవ్

స్టార్ త్రినేత్రం, హనుమకొండ:

రక్తదానం ప్రాణదానంతో సమానమని భీమదేవరపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట డివిజన్ పరిధిలోని మడికొండ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో భీమదేవరపల్లి మండల యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువతను సమన్వయం చేస్తూ, శిబిరం విజయవంతం కావడంలో జక్కుల అనిల్ కుమార్ యాదవ్ కీలక పాత్ర పోషించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి: ఏసీపీ ప్రశాంత్ రెడ్డి



ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం అంటే కేవలం రక్తాన్ని అందించడం మాత్రమే కాదని, ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడే గొప్ప సేవ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, అవసరమైన వారికి సహాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన యువతను ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని ముల్కనూర్ ఎస్సై రాజు సూచించారు. సేవాభావంతో యువత ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో కృషిధర్, సందీప్, అమోఘవర్ష, తిరీష్, అరుణ్, జయంత్, అజయ్ తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు.

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం నిక్షేపణం తెలుగు సినిమాలు

'సింగా' గోపీచంద్.. మాస్టర్ ప్లాన్ పెద్దదే!

ఫైట్ మాస్టర్‌గా వెంకట్‌కు ఇండస్ట్రీలో మంచి అనుభవం ఉంది. ఎన్నో సినిమాలకు యాక్షన్ సన్నివేశాలు రూపొందించిన ఆయన 'సింగా'తో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గోపీచంద్ సినిమాల్లో యాక్షన్‌కు ఎప్పుడూ కొదవ ఉండదు. కానీ ఈసారి ఆ యాక్షన్‌ను తెరకెక్కించడానికి ఫైట్ మాస్టర్ స్వయంగా దర్శకుడిగా మారడం హైలెట్. వెంకట్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సింగా' నుంచి కొత్త పోస్టర్ బయటకొచ్చింది. చేతిలో పొడవాటి ఆయుధం పట్టుకుని, పీరియడ్ గెటప్‌లో గోపీచంద్ కనిపిస్తున్నారు. గతంలో వచ్చిన ఫస్ట్ లుక్‌తో పోలిస్తే ఈసారి పాత్రను మరో కోణంలో చూపించారు. ముఖ్యంగా సినిమా కోసం ఎంచుకున్న బ్యాక్‌డ్రాప్ ఆసక్తి రేపుతోంది.



ఫైట్ మాస్టర్‌గా వెంకట్‌కు ఇండస్ట్రీలో మంచి అనుభవం ఉంది. ఎన్నో సినిమాలకు యాక్షన్ సన్నివేశాలు రూపొందించిన ఆయన 'సింగా'తో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సాధారణంగా ఫైట్ మాస్టర్లు దర్శకులుగా మారినప్పుడు యాక్షన్ ఎపిసోడ్స్ మీద ఎక్కువ అంచనాలు ఉంటాయి. అయితే ఇక్కడ వెంకట్ ఎంచుకున్నది కేవలం ఫైట్లతో నడిచే కథ కాదట. యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక గోపీచంద్ లుక్ విషయంలోనూ మేకర్స్ ప్రత్యేకంగా కేర్ తీసుకుంటున్నారు. మొదటి గ్లింప్స్‌లో రక్తంతో తడిసిన ముఖం, రఫ్ గెటప్‌తో కనిపించిన ఆయన ఇప్పుడు పూర్తిగా పీరియడ్ కాస్ట్యూమ్స్‌లో ఉన్నారు. చుట్టూ అడవి వాతావరణం, భారీ ఆయుధంతో ఉన్న పోస్టర్ చూస్తే కథలో రెండు భిన్నమైన పరిస్థితులు ఉండొచ్చనే హింట్ వస్తోంది. అయితే ఈ రెండు లుక్స్ మధ్య ఉన్న కనెక్షన్‌ను ఇంకా బయటపెట్టలేదు. మరోవైపు 'సింగా' షూటింగ్ ఇప్పటికే యాభై శాతం పూర్తయింది. ఇటీవల ప్రత్యేకంగా నిర్మించిన అడవి సెట్స్‌లో భారీ షెడ్యూల్ ముగించారు. సహజమైన అడవుల్లో షూటింగ్ చేయకుండా ప్రత్యేక సెట్స్ నిర్మించడం వెనక యాక్షన్ సన్నివేశాల అవసరం కూడా ఉండొచ్చు. ప్రస్తుతం డిసెంబర్‌లో మొదలయ్యే తదుపరి షెడ్యూల్ కోసం మరింత పెద్ద సెట్స్ సిద్ధం చేస్తున్నారు. ఈ నిర్మాణాల కోసం నిర్మాతలు భారీగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. గోపీచంద్‌కు కూడా ఈ సినిమా కెరీర్ పరంగా కీలకమే. గత కొంతకాలంగా మాస్ సినిమాలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో విజయాలు అందడం లేదు. కొత్త దర్శకుడిని నమ్ముకుని మరోసారి తనకు బాగా కలిసొచ్చిన యాక్షన్ జానర్‌లోకి దిగుతున్నారు. అయితే రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములా కాకుండా పీరియడ్ సెటప్ ఎంచుకోవడం కొంత భిన్నమైన ప్రయత్నం. గోపీచంద్ ఫిజిక్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఇలాంటి పాత్రలు బాగా సరిపోతాయి. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మలయాళ నటి అనార్కలి నాజర్ ఈ చిత్రంతో తెలుగులోకి అడుగుపెడుతున్నారు.

స్టార్ హీరోయిన్లు తప్ప మిగిలిన వారికి భద్రత ఏది?

సినిమా పరిశ్రమలో మహిళా నటులకు ఉన్న పరిస్థితులపై మాట్లాడిన రాధికా ఆప్టే అక్కడ కేవలం అగ్ర నటీమణులకు మాత్రమే ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. కమర్షియల్ సినిమాలతో పాటు కాన్సెప్ట్ ఓరియంటెడ్ చిత్రాలు, ఓటీటీ ప్రాజెక్టులతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భామ తాజాగా బాలీవుడ్ పరిశ్రమలో మహిళల స్థితిగతులు.. అవకాశాల విషయంలో సాగుతున్న వివక్షపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో స్టార్ స్టేటస్ ఉన్న కొద్దిమంది తప్ప మిగిలిన నటీనటులకు ఎలాంటి భద్రత .. స్థిరత్వం లేదని చేసిన వ్యాఖ్యలు బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్రసీమలోనూ చర్చనీయాంశంగా మారాయి. సినిమా పరిశ్రమలో మహిళా నటులకు ఉన్న పరిస్థితులపై మాట్లాడిన రాధికా ఆప్టే అక్కడ కేవలం అగ్ర నటీమణులకు మాత్రమే ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. -బాలీవుడ్‌లో అలియా భట్, దీపికా పదుకొణె వంటి కొద్దిమంది టాప్ హీరోయిన్లు మాత్రమే సురక్షితమైన స్థానంలో ఉన్నారు. వారు ఎలాంటి సినిమా ఎంచుకున్నా? వారి కెరీర్‌కు .. మార్కెట్‌కు వచ్చే ముప్పేమీ ఉండదు. వారి ఇమేజ్.. వ్యాపార కోణం వారిని సురక్షితంగా ఉంచుతాయి- అని రాధిక అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేశారు. అగ్ర నటీమణుల మినహా మిగిలిన ప్రతిభావంతులైన నటీనటులకు ఇండస్ట్రీలో ఎలాంటి భద్రత లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి ప్రతిభ ఉన్నా? సోషల్ మీడియా ఫాలోయింగ్ .. బాక్సాఫీస్ లెక్కల ఆధారంగానే అవకాశాలు నిర్ణయించబడుతున్నాయని ఆరోపించారు. నిర్మాతలు .. దర్శకులు కేవలం వ్యాపార కోణంలోనే ఆలోచిస్తున్నారని.. నటనకు ప్రాధాన్యత ఇచ్చే కథలు వచ్చినా? వాటికి సరైన బడ్జెట్ లేదా ప్రమోషన్ లభించడం లేదని రాధిక ఆవేదన చెందారు. సినీ రంగాన్ని వ్యాపార వ్యవస్థగా మాత్రమే చూస్తున్నారే తప్ప కళకు ఇచ్చే గౌరవం క్రమంగా తగ్గిపోతోందని రాధిక విమర్శించారు. అవకాశాలు ఇచ్చే విషయంలో నటీనటుల వయస్సు, గ్లామర్, మార్కెట్ క్రేజ్ వంటి అంశాలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో నటనపై ఆధారపడి జీవించే అనేకమంది నటీనటులు ప్రతిరోజూ అభద్రతా భావంతో బతకాల్సి వస్తోందని.. పరిశ్రమలో నిలదొక్కుకోవడం రోజురోజుకూ సవాలుగా మారుతోందన్నారు. ఒకప్పుడు ఓటీటీ వేదికల నటనకు.. కొత్త కథలకు గొప్ప అవకాశాలు ఇచ్చేవని కానీ ఇప్పుడు అక్కడ కూడా పెద్ద సిని మాల ట్రెండ్.. స్టార్ వ్యాల్యూనే ఏలుతోందని రాధిక వ్యాఖ్యానించారు. ఇండిపెండెంట్ సినిమాలు..వైవిధ్యమైన పాత్రలకు ఓటీటీల్లో కూడా పూర్వపు స్థానం దక్కడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వ్యవస్థలో మార్పు రాకపోతే నిజమైన నటులు పరిశ్రమకు దూరం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిజాయితీగా నిర్మొహమాటంగా మాట్లాడే రాధికా ఆప్టే చేసిన సంచలన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలువురు నెటిజన్లు ..విశ్లేషకులు రాధిక వ్యాఖ్యలకు మద్దతు తెలుపుతున్నారు. ఇండస్ట్రీలో ఉన్న నికార్సైన పరిస్థితులకు ఇది అద్దం పడుతోందని కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా? రాధికా చేసిన ఓపెన్ కామెంట్స్ మరోసారి పరిశ్రమలో అసమానతలపై సరికొత్త చర్చకు తెర తీసినట్లు అయింది.



కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్.. అన్నలు ఊహించిన యాంగిల్!





అయితే కీర్తి సురేష్, రాధికా ఆప్టే లీడ్ రోల్స్ లో నటించిన 'అక్క' వెబ్ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. ఒకప్పుడు పక్కింటి అమ్మాయిలా కనిపించారు.. 'మహానటి'గా మెప్పించారు.. ఇప్పుడు మాత్రం చేతిలో తుపాకీ పట్టుకొని సవాల్ విసురుతున్నారు. తన మాటే శాసనం కావాలనే లెక్కతో కనిపిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ లో ఇలాంటి యాంగిల్ కూడా ఉందా అనిపిస్తోంది. ఆమె లీడ్ రోల్ లో నటించిన 'అక్క' వెబ్ సిరీస్ ట్రైలర్ చూస్తే కచ్చితంగా అదే ఫీలింగ్ వస్తుందని చెప్పాలి.

ఇప్పటివరకు చూసిన కీర్తికి, ఇందులో కనిపిస్తున్న అప్పీయరెన్స్ కు చాలా డిఫరెన్స్ ఉందని చెప్పాలి. అయితే కీర్తి సురేష్, రాధికా ఆప్టే లీడ్ రోల్స్ లో నటించిన 'అక్క' వెబ్ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. యష్ రాజ్ ఫిల్మ్స్ కు చెందిన వైఆర్ఎఫ్ ఎంటర్టైన్మెంట్ ప్రొడ్యూస్ చేసిన ఆ సిరీస్ కు ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహించారు. రీసెంట్ గా విడుదలైన ట్రైలర్ లో ఇద్దరు మహిళల మధ్య జరిగే పవర్ వార్ ను చూపించారు. వెబ్ సిరీస్ స్టోరీ 1985 నాటి నేపథ్యంలో పెర్నూరు అనే కల్పిత ప్రాంతంలో సాగుతుంది. ఇక్కడ దాదాపు 800 ఏళ్లుగా మహిళలదే డామినేషన్. కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ వారి చేతుల్లోనే ఉంటాయి. ఆ వరల్డ్ లో టాప్ ప్లేస్ లో ఉండే మహిళను 'అక్క"అని పిలుస్తారు. అలాంటి ఏరియాను తన కంట్రోల్ లో ఉంచుకున్న భవాని రోల్ లో కీర్తి కనిపిస్తున్నారు. తన పవర్ కాపాడుకోవడానికి ఆమె ఎంతకైనా సిద్ధపడేలా కనిపిస్తోంది. అయితే భవాని డామినేషన్ కు రుద్ర రూపంలో సవాల్ ఎదురవుతుంది. ఆ రోల్ రాధికా ఆప్టే పోషించారు. భవాని వరల్డ్ ను సొంతం చేసుకోవాలని చూస్తుంటారు. దీంతో ఇద్దరి మధ్య వార్ మొదలవుతుంది.

ఒకరు తమ అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తే.. మరొకరు ఆ ప్లేస్ ను దక్కించుకోవాలని ప్రయత్నిస్తారు. చివరకు వారిద్దరలో ఎవరు పైచేయి సాధిస్తారన్నదే స్టోరీలో మెయిన్ ఎలిమెంట్. సాధారణంగా గ్యాంగ్ స్టర్ స్టోరీల్లో జెంట్స్ డామినేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. కానీ 'అక్క'లో మహిళలే గ్యాంగ్స్ నడిపిస్తూ, బిజినెస్ లను కంట్రోల్ చేస్తూ, తమ అధికారాన్ని కాపాడుకునేందుకు పోరాడుతున్నారు. ఆ కొత్త వరల్డ్ స్టోరీకి స్పెషాలిటీనే తీసుకొస్తోంది.

తుపాకులు, పోరాటాలు, విలన్ల మధ్య వార్స్ తో ట్రైలర్ లో యాక్షన్ కు ఇంపార్టెన్స్ ఇచ్చారు. పవర్, ట్రస్ట్, లెగసీ చుట్టూ కథను నడిపిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక కీర్తి సురేష్ 'అక్క'లో కనిపిస్తున్న భవాని రోల్ మాత్రం ఆమెకు కొత్త. కేవలం మాటలతోనే కాకుండా, తన చేతలతోనూ డామినేషన్ చూపించే మహిళగా కనిపిస్తున్నారు. తనలోని మరో యాంగిల్ ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నారు. ట్రైల ర్‌లో కనిపించిన ఆ కొత్త అవతార్ సిరీ స్‌పై హైప్ పెంచుతోంది. అయితే, భవాని పాత్రలో కీర్తి ఎంతగా మెప్పిస్తారు.. రుద్రతో వార్ ఎలాంటి ట్విస్టులు తీసుకుంటుందనేది అక్టోబర్ 30న తేలనుంది.

టాలీవుడ్‌లో కన్నడ భామల ప్రయాణం!


దశాబ్దాలుగా కన్నడ భామలు తెలుగు తెరకు పరిచయమై అందచందాలు.. నటనతో స్టార్ హోదాను సొంతం చేసుకుంటూ టాలీవుడ్‌లో తిరుగులేని ముద్ర వేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ నిత్యం కొత్తదనానికి.. ఇతర భాషల నుంచి వచ్చే వైవిధ్యమైన ప్రతిభకు ఆప్యాయంగా స్వాగతం పలుకుతూనే ఉంటుంది. ముఖ్యంగా కన్నడ చిత్రసీమ నుంచి టాలీవుడ్‌కు వచ్చిన నటీమణులు ఇక్కడ సాధించిన విజయం.. సృష్టించిన ఇంపాక్ట్ సామాన్యమైనది కాదు. దశాబ్దాలుగా కన్నడ భామలు తెలుగు తెరకు పరిచయమై అందచందాలు.. నటనతో స్టార్ హోదాను సొంతం చేసుకుంటూ టాలీవుడ్‌లో తిరుగులేని ముద్ర వేశారు. కన్నడ నాట జన్మించి టాలీవుడ్‌ను ఏలిన భామల్లో మొదటి వరుసలో నిలుస్తారు అనుష్క శెట్టి. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన -సూపర్- చిత్రంతో పరిచయమైన అనుష్క అటుపై -అరుంధతి-, -బాహుబలి- వంటి పాన్-ఇండియా చిత్రాలతో లేడీ సూపర్ స్టార్‌గా ఎదిగారు. స్వీటీ బాటలోనే అడుగుపెట్టిన రష్మిక మందన -ఛలో-, -గీత గోవిందం- చిత్రాలతో నేషనల్ క్రష్‌గా మారింది. -పుష్ప- సిరీస్‌తో గ్లోబల్ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే అందరికీ తక్షణమే స్టార్‌డమ్ దక్కలేదు. పాన్-ఇండియా సంచలనం -కేజీఎఫ్- సిరీస్‌తో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న శ్రీనిధి శెట్టి టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో బిజీ కాలేదు. అలాగే -అమిగోస్-, -నా సామిరంగా- వంటి చిత్రాలలో అందం, అభినయంతో ఆకట్టుకున్న ఆషికా రంగనాథ్ కు మంచి నటిగా ప్రశంసలు అందుకున్నా? స్టార్ హీరోయిన్ రేంజ్ ఆఫర్లు దక్కించుకోవడానికి ఇంకా కష్టపడాల్సి వస్తోంది. ప్రస్తుత కన్నడ పరిశ్రమ నుంచి వచ్చి టాలీవుడ్ దృష్టిని ఆకర్షిస్తున్న భామల్లో రుక్మిణి వసంత్ అగ్రస్థానంలో ఉన్నారు. -సప్త సాగరదాచే ఏల్లో- చిత్రంతో తన నటనతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసిన భామ ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటోంది. ఒకప్పుడు తెలుగు చిత్రసీమలో ఒక విజయం సాధిస్తే వరుసగా ఆఫర్లు క్యూ కట్టేవి. కానీ



ప్రస్తుత డిజిటల్ యుగంలో కాస్టింగ్ సమీకరణాలు.. కాంబినేషన్ క్రేజ్ .. కథల ఎంపిక విధానం పూర్తిగా మారిపోయాయి. గ్లామర్‌తో పాటు కథకు సరిపోయే విలక్షణమైన పాత్రలు ఎంచుకుంటేనే సుదీర్ఘ కాలం నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రతి సినిమా కూడా ఓ కొత్త పరీక్షగానే మారుతోంది. ఏది ఏమైనా? టాలీవుడ్‌లో కన్నడ భామల హవా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. రాబోయే పెద్ద సినిమాలలో నటిస్తున్న శ్రీనిధి శెట్టి, ఆషికా రంగనాథ్ , రుక్మిణి వసంత్ వంటి యంగ్ బ్యూటీస్ సరైన కమర్షియల్ హిట్ పడితే స్టార్ హీరోయిన్ల లీగ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. పరిశ్రమలో మారుతున్న ట్రెండ్స్‌ను ఫాలో అవుతూ భవిష్యత్ లో టాలీవుడ్‌లో ఎలాంటి విజయాలు నమోదు చేస్తారో చూడాలి.

'మిర్జాపూర్' సినిమాకి ఓటిటి డేట్ ఫిక్స్?

ఇండియన్ ఓటిటి హిస్టరీలో ఒక సంచలనం సెట్ చేసిన కంటెంట్ లో అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారంకి వచ్చిన సెన్సేషనల్ హిట్ సిరీస్ మిర్జాపూర్ కూడా ఒకటి. మొదటి సీజన్ నే భారీ హిట్ అయ్యింది. పాన్ ఇండియా లెవెల్లో కూడా మంచి క్రేజ్ ని సొంతం చేసుకున్న ఈ సిరీస్ ని రీసెంట్ గా మేకర్స్ సినిమాగా కూడా తెరకెక్కించి విడుదల చేశారు.అదే నటీనటుల కలయికలో దర్శకుడు గురుమీత్ సింగ్ తెరకెక్కించిన ఈ హై టెన్షన్ యాక్షన్ డ్రామా బిగ్ స్క్రీన్స్ పై కూడా పెద్ద హిట్ అయ్యింది. అయితే ఈ ఏడాది గత సెప్టెంబర్ 4న థియేటర్స్ లోకి వచ్చింది కానీ మిగతా సినిమాల తరహాలో నెల రోజులకే ఓటిటిలో రాలేదు.చాలామంది ఈ సినిమా ఓటిటిలో చూడాలని కూడా ఎదురు చూస్తున్నారు. అయితే సినిమా రిలీజ్ డేట్ పై లేటెస్ట్ బజ్ తెలుస్తుంది. దీని ప్రకారం ఈ సినిమాని అమెజాన్ ప్రైమ్ వీడియో వారు ఈ అక్టోబర్ 29 నుంచి అందుబాటులోకి తెస్తారని తెలుస్తుంది. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com